నీ వాక్యము నన్ను బ్రతికించియున్నది. కీర్తనలు 119:50
నీ వాక్యములు వెల్లడియగుట తోడనే వెలుగు కలుగును. కీర్తనలు 119:130
వాక్యపు వెలుగు

# యాగములు

స్తోత్రార్హుడైన యేసయ్యకు స్తుతి, మహిమ, ఘనత, ప్రభావములు కలుగును గాక!

**మూలవాక్యము:- హెబ్రీ 13:15** కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము.

యాగము చేయడము అనే మాటను మన భారత దేశములో తరచుగా వింటూనే ఉంటాము. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలలో యజ్ఞయాగాదులు అనునవి చాలా ప్రధానమైనవి.

ఒక వ్యక్తి చేయతలపెట్టిన ఏదేని ఒక కార్యము గాని, ఉద్దేశ్యము గాని నెరవేర్చబడాలి అన్నప్పుడు ఎన్నో ఆటంకాలు, సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే ఆ సమస్యలను అధిగమించి చేయతలపెట్టిన ఆ కార్యము, ఉద్దేశ్యము సఫలము కావడానికి జరిగించే ప్రక్రియను "యాగము" అంటారు.

**యాగము :- యెషయా 4:4** తీర్పుతీర్చు ఆత్మవలనను దహించు ఆత్మవలనను ప్రభువు సీయోను కూమార్తెలకున్న కల్మషమును కడిగివేయు నప్పుడు యెరూషలేమునకు తగిలిన రక్తమును దాని మధ్యనుండి తీసివేసి దాని శుద్ధిచేయునప్పుడు

యాగము చేయాలంటే అగ్ని, కట్టెలు, నెయ్యి అవసరము. ఆ ప్రక్రియ జరిగించడానికి యాజకుడు అవసరము. ఇది పాత నిబంధన క్రమము. అదే క్రొత్త నిబంధనలో అయితే అగ్ని – పరిశుద్ధాత్మ దేవుడు, కట్టెలు – ప్రార్థన, నెయ్యి – ఆశ,ఆసక్తి. ఈ ప్రక్రియ జరిగించవలసిన యాజకుడవు నువ్వు, నేనే.

సర్వసాధారణముగా మనము వినే యాగములు కొన్ని – వర్షము కురవడము కోసము(అడవులు నరికేసి) వరుణ యాగము చేస్తారు(కాని వర్షాలు కురువవు). అమ్మాయికి వివాహము జరుగకపోతే అది సర్ప దోషము అని చెప్పి ఆ దోషము పోవడానికి సర్పయాగము చేస్తారు(కాని వివాహాలు జరుగవు). పూర్వము రాజులు యుద్ధాలకు వెళ్లేటప్పుడు యుద్ధంలో విజయం కోసం అశ్వమేధ యాగము చేసేవారు(అలాగని అన్ని యుద్ధాలలో గెలిచేవారు కాదు). ఇలా ఆయా సందర్భాలలో రకరకాల యాగాలు చేసేవారు. అయితే ఇవన్ని విగ్రహములకు చేస్తారు. ఈ యాగములు చేయడం ఎంతో ఖర్చుతో కూడుకున్నది, మరియు నిష్ప్రయోజనమైనవి. ఎందుకంటే ఆ యాగములు ఏ దేవతల సహాయము కొరకు చేస్తారో అవి నిజమైన దేవుళ్ళు కాదు. అవి చూడవు, వినవు,వాసన చూడవు, సహాయము చేయవు. అలాంటి వ్యర్థమైన దేవతలకు ఎన్నో వ్యయ,ప్రయాసల కోర్చి యాగములు చేస్తున్నారు.

పరిశుద్ధ గ్రంధము ప్రతి క్రైస్తవుడు యాగములు చేయాలని భోధిస్తుంది. మనమైతే నిజ దేవునికి, చూచుచున్న దేవునికి, వినే దేవునికి, సహాయము చేసే దేవునికి ఈ యాగములు చేయాలి. క్రైస్తవుడు యాగములు చేయాలి అని నేను చెబుతున్న మాట మీకు క్రొత్తగా అనిపించినా ఇది వాస్తవము,

పరిశుద్ధ గ్రంధ క్రమము అని నేను తెలియజేస్తున్నాను. ఈ యాగములు చేయడము కష్టము కాదు, ఖర్చుతో కూడుకున్నవి కాదు. చాలా సులువైనవి. పరిశుద్ధ గ్రంధము మనలను చేయమని తెలియజేస్తున్న కొన్ని యాగముల గురించి ధ్యానం చేద్దాం.

1. **స్తుతి యాగము: కీర్తన 50:14** దేవునికి స్తుతి యాగము చేయుము మహోన్నతునికి నీ మ్రొక్కుబడులు చెల్లించుము.

**హెబ్రీ 13:15** కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము.

**లేవి 19:24** నాలుగవ సంవత్సరమున వాటి ఫలము లన్నియు యెహోవాకు ప్రతిష్ఠితమైన స్తుతియాగ ద్రవ్యములగును; అయిదవ సంవత్సరమున వాటి ఫలములను తినవచ్చును

**కీర్తన 56:13** నేను నీకు మ్రొక్కుకొని యున్నాను నేను నీకు స్తుతియాగముల నర్పించెదను.

**కీర్తన 50:23** స్తుతియాగము అర్పించువాడు నన్ను మహిమ పరచు చున్నాడు నేను వానికి దేవుని రక్షణ కనుపరచునట్లు వాడు మార్గము సిద్ధపరచుకొనెను.

**యిర్మీయా 17:26** మరియు జనులు దహనబలులను బలులను నైవేద్యములను ధూపద్రవ్య ములను తీసికొని యూదా పట్టణములలోనుండియు, యెరూషలేము ప్రాంతములలోనుండియు, బెన్యామీను దేశములో నుండియు, మైదానపు దేశములోనుండియు, మన్యములోనుండియు, దక్షిణదేశములోనుండియు వచ్చెదరు; యెహోవా మందిరమునకు స్తుతియాగ ద్రవ్యములను తీసికొని వచ్చెదరు.

**కీర్తన33:1** నీతిమంతులారా, యెహోవాను బట్టి ఆనందగానము... చేయుడి. స్తుతిచేయుట యథార్థవంతులకు శోభస్కరము.

స్తుతి చేయుట యథార్థవంతులకు శోభస్కరం. అందరూ స్తుతులు చేయలేరు. స్తుతి అనగానే నాగుపాములా బుసకొట్టేవారున్నారు. స్తుతియాగము అంటే దేవుని నామములను బట్టి ఆయనను స్తుతించడము, ఆయన కార్యములను బట్టి స్తుతించడము మరియు ఆయన చేసిన మేలులను బట్టి స్తుతించడమే.

**Example:- కీర్తన119:164** నీ న్యాయవిధులనుబట్టి దినమునకు ఏడు మారులు నేను నిన్ను స్తుతించు చున్నాను.

ప్రపంచానికి దావీదు మహారాజు స్తుతిని గూర్చిన క్రమం నేర్పించాడు. దినమునకు 7మారుల మట్టుకు నిన్ను స్తుతించెదను అన్నాడు. అందుకే ఒక నిరుపేద గొర్రెలకాపరి ప్రపంచంలో మొట్ట మొదటి మహారాజు అయ్యాడు. అయన మహారాజు కాబట్టి ఆయన కుమారుడైన సొలోమోనును కూడా మహారాజు అన్నారు. పరిశుద్ధ మందిరాన్ని కట్టడానికి సమస్తము సమకూర్చిన ఏకైక వ్యక్తిగా బైబిల్ చరిత్రలో దావీదు నిలిచాడు. వీటన్నింటికి కారణం స్తుతి.

**ALERT:- ముఖ స్తుతి : కీర్తన 78:37** నోటి మాటతో వారు ఆయనను ముఖస్తుతిచేసిరి తమ నాలుకలతో ఆయనయొద్ద బొంకిరి.




స్తుతి అనేది హృదయాంతరంగములో నుండి రావాలి. అంతేగాని ముఖం ఎదుట చేసేది స్తుతి కాదు. ముఖస్తుతి రాజకీయ నాయకుల దగ్గర, వేషధారుల దగ్గర చూడగలం. నేటి దినాలలో అనేకులు దేవుని ఎదుట ఆయనను ముఖస్తుతి చేస్తున్నారు.

2. **విశ్వాస యాగము: ఫిలిప్పి 2:17** మరియు మీ విశ్వాస యాగములోను దాని సంబంధమైన సేవలోను నేను పానార్పణముగా పోయబడినను, నేనా నందించి మీ యందరితోకూడ సంతోషింతును.

**విశ్వాసమనగా నేమి?**

**హెబ్రీ 11:1** విశ్వాసమనునది నిరీక్షింపబడువాటియొక్క నిజ స్వరూపమును అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది.

**హెబ్రీ 11:17-19** అబ్రాహాము శోధింపబడి విశ్వాసమునుబట్టి ఇస్సా కును బలిగా అర్పించెను.
ఎవడు ఆ వాగ్దానములు సంతోషముతో అంగీకరించెనో,ఇస్సాకువలననైనది నీ సంతానమనబడును అని యెవనితో చెప్పబడెనో, ఆ అబ్రాహాము, మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచినవాడై తన యేకకుమారుని అర్పించి, ఉపమానరూపముగా అతనిని మృతులలోనుండి మరల పొందెను.

**Example:- (ఆదికాండము 22 వ అధ్యాయము)**వాగ్దానము చేసిన 25 సంవత్సరములకు కుమారున్ని ఇచ్చిన దేవుడు, ఆ బాలుడు పసివాడై ఉండగానే నాకు బలి ఇమ్మని అడిగితే తండ్రి పరిస్థితిని మనం అర్థం చేసుకోవాలి. మనమైతే ఏం చేసే వారమో తెలియదు గాని, అబ్రహాము దేవుడు తన జీవితంలో చేసిన మేళ్లను జ్ఞాపకం చేసుకున్నాడు. ఒంటరిగా వున్న తనను దూరదేశానికి తీసుకొని వచ్చి ఆస్తి పరునిగా చేసి పశువుల మందలు, గొర్రెల మందలు, ఎడ్ల మందలు దయచేసి, భార్యను ఇతరులు ముట్టకుండా భద్రపరచిన దేవుడు, కుమారుణ్ణి ఇచ్చిన దేవుడు ఆ కుమారుడినే బలిగా అడిగాడంటే, అది తనను పరీక్షించడం, పరిశోధించడమేనని గ్రహించాడు. ఇన్ని ఇచ్చిన దేవుడు తనకు ఏ లోటు, కొరత ఉండనివ్వడు, రానివ్వడని కుమారుణ్ణి బలిగా అర్పించడానికి సిద్ధపడ్డాడు. ఇదే విశ్వాసం. ఇదే విశ్వాస యాగము. దేవుడు మనకు దయచేసిన దేనినైనా తిరిగి దేవునికి ఇవ్వటానికి మనము వెనుకంజ వేయకుండా స్థిరంగా వుండాలి.

3. **సజీవ యాగము (శరీరము): రోమా 12:1** కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను.ఇట్టి సేవ మీకు యుక్త మైనది .

**లేవి 9:13,14** మరియు వారు దహన బలిపశువుయొక్క తలను అవయవములను అతనికి అప్పగింపగా అతడు బలి పీఠముమీద వాటిని దహించెను. అతడు దాని ఆంత్రము లను కాళ్లను కడిగి బలిపీఠముమీదనున్న దహనబలి ద్రవ్యముపైని దహించెను.

ఏలాగున బలిపశువు యొక్క అవయవాలను బలిపీఠముపైన వరుసగా పేర్చి, బలిపీఠపు నిప్పు చేత కాల్చబడి యెహోవాకు యింపైన సువాసనగా ఆఘ్రాణించబడుతుందో, ఆలాగే మన ప్రతి అవయవము ప్రార్థన అనే బలిపీఠంపైన దహించబడి యెహోవాకు ఇష్టమైన యింపైన సువాసనగా మార్చబడాలి. ఏ ఘటాలనైతే పాపానికి లోపరచియున్నామో వాటిని ఇప్పుడు నీతికి, పరిశుద్ధతకి అప్పజెప్పడం మన బాధ్యత.ఇది యుక్తమైన సేవ, వ్యక్తిగత పరిశుద్ధత.

మనం కూడా ప్రార్థన బలిపీఠంపైన మన అవయవాలను పరిశుద్ధాత్మ అగ్నిలో కాల్చాలి. మన అవయవాలలోనున్న బలహీనతలను కాల్చి పరిశుద్ధ అవయవాలుగా వాటిని మార్చి దేవుని సేవ చేయాలి. పరిశుద్ధ పరిచర్యను నిందల పాలు చేయడానికి సాతనుడు వాని ప్రతినిధులను సంఘాలలో ప్రవేశపెట్టాడు. పేరుకు వారు బోధకులు,కాని వారు చేసేవి సాతాను పనులు. ఈనాడు చాలా మంది ఈ సజీవ యాగం చేయకుండా నిర్భయంగా వారి అవయవాలతో పాపం పెంపు చేస్తున్నారు. తండ్రి స్థానంలో ఉండవలసిన బోధకులు తప్పుడు పనులు చేస్తున్నారు. ఇలాంటి వారితో జాగ్రత్త సుమా!

**Example:-** హెబ్రీ 5:7 శరీరధారియై యున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్లతోను తన్ను మరణమునుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను సమర్పించిభయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను.

**యేసుక్రీస్తు సజీవ యాగముగా మనందరి పాపముల కొరకు సిలువలో అర్పించబడ్డారు.**

హెబ్రీ 11:32-37 ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలను వారిని గూర్చియు, ప్రవక్తలనుగూర్చియు వివరించుటకు సమయము చాలదు.
33 వారు విశ్వాసముద్వారా రాజ్యములను జయించిరి; నీతికార్యములను జరిగించిరి; వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్లను మూసిరి;
34 అగ్నిబలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి; బలహీనులుగా ఉండి బలపరచబడిరి; యుద్ధములో పరాక్రమశాలులైరి; అన్యుల సేనలను పారదోలిరి.
35 స్త్రీలు మృతులైన తమ వారిని పునరుత్థానమువలన మరల పొందిరి. కొందరైతే మరి శ్రేష్ఠమైన పునరుత్థానము పొందగోరి విడుదల పొందనొల్లక యాతనపెట్టబడిరి.
36 మరికొందరు తిరస్కారములను కొరడాదెబ్బలను మరి బంధకములను ఖైదును అనుభ వించిరి.
37 రాళ్లతో కొట్టబడిరి, రంపములతో కోయబడిరి, శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి,గొఱ్ఱచర్మ ములను మేకచర్మములను వేసికొని, దరిద్రులైయుండి శ్రమపడి హింసపొందుచు,

**పైన చెప్పబడిన వీరందరు విశ్వాసమును బట్టి సజీవయాగముగా తమ శరీరములను దేవునికి సమర్పించుకొన్నారు.**




4. **ఉపకారము, ధర్మము - దేవునికి ఇష్టమైన యాగములు : హెబ్రీ 13:16** ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి, అట్టి యాగములు దేవుని కిష్టమైనవి.

**ఫిలిప్పీ 4:18** నాకు సమస్తమును సమృద్ధిగా కలిగియున్నది మీరు పంపిన వస్తువులు ఎపఫ్రొదితువలన . పుచ్చుకొని యేమియు తక్కువలేక యున్నాను; అవి మనోహరమైన సువాసనయు, దేవునికి ప్రీతికరమును ఇష్టమునైన యాగమునై యున్నవి.

**Example:- 1సమూయేలు24:18** ఈ దినమున నీవు నా అపకారమునకు ఉపకారముచేసిన వాడవై నా యెడల నీకున్న ఉపకారబుద్ధిని వెల్లడిచేసితివి గనుక నీవు నాకంటె నీతిపరుడవు.

**దావీదులో ఉన్న ఈ ఉపకార బుద్ధి తనను దేవునికి ఇష్టునిగా, దేవుని హృదయానుసారునిగా పిలవబడటానికి ఒక శ్రేష్టమైన కారణముగా మనం గుర్తించాలి**

**స్తుతులు చెల్లిస్తూ, దేవునికి విశ్వాసాన్ని కనుబరుస్తూ, మన అవయవాలకు పరిశుద్ధత నేర్పించి, పరిచర్యలో దైవ సేవకులకు, మందిరాలకు ఇచ్చే వస్తువులైనా, మరేదైనా దేవునికి ఇష్టమైనవిగా, ప్రీతికరంగా వుంటాయి. ఇలాంటివి మనం మరచిపోకూడదని దేవుడు హెచ్చరిస్తున్నాడు.**

**ఈ lent కాలంలో మన ఆహారాన్ని ఆకలిగొనిన వారికి పెట్టడం సబబు,ఆశీర్వాదకరం. మందిరములో పేదలు, అనాధలు, విధవరాండ్రు, పరిశుద్ధులు ఉంటారు కనుక ఇది మీ దాతృత్వానికి ఒక మంచి చోటు. దేవుడు నీ ఆహారాన్ని ఆకలి గొన్న వారికి పెట్టమన్నాడు గాని,నీవు తిని పెట్టమనలేదు. నీవు ఉపవాసముండి ఆ ఆహారాన్ని పేదలకు పంచు. ఇది మాన్యమైనది.**

**ఆతిథ్యం, దాతృత్వం ఈ lent లోనే నేర్చుకోవాలి, అలవరచుకోవాలి . అలాగు చేయడానికి పరిశుద్ధాత్మ దేవుడు మీకు సహాయం చేయును గాక....ఆమెన్...ఆమెన్...ఆమెన్...**